వేగానికి కళ్లెం ఏదీ?

- పాతనగరం వీధి రోడ్లలో దూసుకెళ్తున్న వాహనాలు
- భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు
- స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు వేడుకోలు



కంచర వీధి యాసిన్ బాబా దర్గా వద్ద కానరాని వేగ నిరోధకాలు



29వ వార్డులో స్పీడ్ బ్రేకర్లు లేని దిబ్బలపాలెం

డాబాగార్డెన్స్: పాతనగరంలోని వీధి రోడ్లపైకి రావాలంటేనే జనం ఆందోళన చెందుతున్నారు. వాహనాల అతివేగంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడతున్నారు. ఎటువైపు నుంచి ఏ వాహనం దూసుకొస్తుందో తెలియడం లేదు. జనావాసాలు ఉండే రోడ్లలోనూ వాహన చోదకులు అతివేగంగా వాహనాలు నడుపుతుండటంతో హడలిపోతున్నారు. వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అతివేగంతో ప్రమాదాలు..

పాతనగరంలో ముఖ్యంగా ఏవీఎన్ కళాశాల నుంచి రెల్లి వీధికి వెళ్లే ప్రధాన మార్గంతోపాటు కంచర వీధి, యాసిన్‌బాబా దర్గా, అల్లిపురం, 29వ వార్డు మహారాణిపేట, దిబ్బలపాలెం, రామజోగిపేట, ఆంథోనీనగర్, ఘోషాస్పత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో కుర్రాళ్లు వాహనాలను అతివేగంతో నడుపుతున్నారు. ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఇష్టానుసారంగా డ్రైవ్ చేస్తున్నారు. దీంతో పిల్లలు, మహిళలు రోడ్ల మీదకు రావాలంటే భయపడతున్నారు. వేగం కారణంగా వాహనం నడిపేవారితోపాటు స్థానికులు కూడా గాయాలపాలవుతున్నారు. తాగిన మైకంలో కొందరు.. పలువురు యువకులు వాహనాలను ఇష్టానుసారం నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. చెంగల్రావుపేటలో మసీదు, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, రామాలయం, కంచర వీధిలో ఎంబర్‌మన్నార్ గుడి, కనకమహాలక్ష్మి ఆలయం, ఘోషాస్పత్రి ఉండగా.. జగదాంబ జంక్షన్‌కు కూత వేటు దూరంలో 29వ వార్డు దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, డాబాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్లే భక్తులతో నిత్యం ఈ కూడళ్లు రద్దీగా ఉంటాయి. మితిమీరిన వేగంతో దూసుకొస్తున్న వాహనాలతో వీరు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, వాహనాల వేగానికి కళ్లెం వేయాలని పాతనగరం వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బయటకు రావాలంటేనే భయం



మా ప్రాంతం మీదుగా పాఠశాల, చర్చ్, అంబికాబాగ్ రామాలయానికి అధిక సంఖ్యలో వెళ్తుంటారు. యువత ఈ మార్గాల్లో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. దీంతో బయటకు రావాలంటేనే భయాందోళనలుగా ఉంది. ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– సిహెచ్.రాజేశ్వరి, దిబ్బలపాలెం

స్పీడ్ బ్రేకర్లతోనే వేగ నిరోధం



రోడ్డు దాటే సమయంలో ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియడం లేదు. వేగంగా వచ్చి స్థానికులను ఢీకొంటున్నారు. స్పీడ్ బ్రేకర్లు వేస్తే వేగాన్ని నిరోధించే అవకాశం ఉంది.

– గద్రెడ్డి రమాదేవి, రామాలయం వీధి

పలుమార్లు విన్నవించాం..



స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో జరుగుతున్న అనర్థాలను అధికారులకు పలుమార్లు విన్నవించాం. వేగ నిరోధకాలు లేనందువల్ల యువత అతివేగంతో వాహనాలు డ్రైవ్ చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. అతివేగంపై పోలీసులు దృష్టి సారించాలి.

– నాగమణి, మహారాణిపేట

అధికారులు స్పందించాలి



29వ వార్డు దిబ్బలపాలెంలో ద్విచక్ర వాహనాలు పెద్ద ఎత్తున తిరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా పిల్లలు, మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. కుర్రకారు ఇష్టానుసరంగా వాహనాలు తిప్పుతున్నారు. ప్రశ్నిస్తే తగాదాలకు దిగుతున్నారు. అధికారులు స్పందించాలి.

– వఠ్రి వరలక్ష్మి, దిబ్బలపాలెం

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



దొండపర్తి సచివాలయం-2 పరిధిలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ జయదేవి



అల్లిపురంలో తల్లిపాల శ్రేష్ఠతను తెలిపే ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఏసీడీపీవో శ్రీలత తదితరులు

సీతమ్మధార: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని దొండపర్తి యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్రావణి అన్నారు. దొండపర్తి సచివాలయం-2లోని ఆశీలమెట్ట అంగన్‌వాడీ కేంద్రం, అమర్‌నగర్, భగత్‌సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సి.జయదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ నిర్వాహకులపై ఎంతో నమ్మకంతో కేంద్రాలకు పంపిస్తున్నారన్నారు. అక్కడ ఆటపాటలతో కూడిన విద్య అందించడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలలు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల బిడ్డకు మానసిక, శారీరక ఎదుగుదల, తెలివితేటలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజార్ వి.ఇందిరాదేవి, డీపీహెచ్ఎన్ మనోరమ, హెచ్.వి. అరుణకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డబ్బా పాలు వద్దు.. తల్లిపాలు ముద్దు

అల్లిపురం: డబ్బా పాలు వద్దు.. తల్లి పాలు ముద్దు.. అని ఏసీడీపీవో శ్రీలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అల్లిపురంలో 33వ వార్డు అమ్మవారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టాలని సూచించారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. గర్భిణులు తక్కువ పెట్టుబడితో అందుబాటులో దొరికే పిండి పదార్థాలు, ఆకు కూరలు విధిగా తీసుకోవాలన్నారు. ప్రతి రోజు పాలు, గుడ్డు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళా పోలీస్, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల సేవలో ప్రేమ సమాజం



ఆశ్రయులకు వస్త్రాలు అందిస్తున్న డాక్టర్ దిలీప్‌కుమార్, ప్రేమ సమాజం కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: ప్రేమ సమాజం కుష్టు శరణాలయం 70వ వార్షికోత్సవం సోమవారం ప్రేమ సమాజంలోని న్యూ మీటింగ్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎండోక్రైనాలజిస్ట్ వైద్య నిపుణుడు డాక్టర్ దిలీప్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రేమ సమాజం చేపడుతున్న సేవలన్నింటి కన్నా కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి సేవలందించే కార్యక్రమం మహోన్నతమైందన్నారు. దేశంలో కుష్టు వ్యాధి పూర్తిగా నయమైనా, ప్రస్తుత ఆహారపు అలవాట్లు, ఒత్తిళ్ల వల్ల అనేక మందికి సుగర్ వ్యాధి వస్తోందని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బుద్ధా శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం 1955 నుంచి కుష్టు వ్యాధితో బాధపడుతున్న అనేక మందిని అక్కున చేర్చుకుని వారికి సపర్యాలు చేస్తూ, ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ మనోధైర్యం అందిస్తోందన్నారు. ఈ సంస్థలో వైద్య సేవలు పొందిన రోగులు తిరిగి మామూలు స్థితికి చేరుకుని, తమ ఇళ్లకు వెళ్లిపోగా, ప్రస్తుతం 13 మంది మాత్రమే ఉన్నారని చెప్పేందుకు ఎంతో గర్విస్తున్నామన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు మట్టుపల్లి హనుమంతరావు, కేశాప్రగడ నర్సింహమూర్తి, కార్యదర్శి కె.హరిమోహనరావు, కోశాధికారి ఎం.వి.వి.కె. గుప్తా, సలహాదారుడు డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి వి.మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు ఉప్పల భాస్కరరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఆశ్రమవాసులు, బాలబాలికలు పాల్గొన్నారు.

26 నుంచి రాజస్థాన్‌లో జాతీయ మీడియా సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

డాబాగార్డెన్స్: బ్రహ్మకుమారీస్ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. బ్రహ్మకుమారీస్ నేతృత్వంలో రాజస్థాన్ మౌంట్‌అబూలో నిర్వహించనున్న జాతీయ మీడియా సదస్సుకు సంబంధించిన పోస్టర్ సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును విశాఖ జర్నలిస్టులు విజయవంతం చేయాలని కోరారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు జరిగే ఈ సదస్సులో పాల్గొనే పాత్రికేయులు ఈనెల 12వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చేనెల 24న విశాఖలో మీడియా ప్రతినిధుల బృందం రైలులో రాజస్థాన్ బయలుదేరుతుందని చెప్పారు. వివరాలకు 85558 57990 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు సిద్ధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, అనురాధ, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుదీర్ఘ సేవలకు సత్కారం



డాక్టర్ లక్ష్మీప్రభను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 33 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించిన ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ కె.రాధాకృష్ణ, హోం సైన్స్ విభాగాధ్యక్షులు డాక్టర్ వై.లక్ష్మీప్రభను ఘనంగా సత్కరించారు. సోమవారం కళాశాలలో వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు సత్కరించి శుభకాంక్షలు తెలిపారు.

'పల్లా'తో మర్యాదపూర్వక భేటీ



ఎమ్మెల్యే పల్లాను అభినందిస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి కోరారు. పల్లాను కలిసిన వారిలో కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, ఆర్.ఎ.నాయుడు, కన్వీనర్ రాజాన వెంకట్రావు, సహాయ కార్యదర్శి గణేష్, తదితరులు ఉన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీగాయకులు

సీతంపేట: స్వర మనోహరం సంగీత్ సంస్థ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను అలరించింది. గాయనీ గాయకులు మనోహర్, దేవరాజ్, శివనారాయణ, హర్షప్రియ, కోమలి, విశ్వప్రసాద్, నాగేశ్వరరావు, అలేఖ్య, సావిత్రి, ఆది, జాస్మిన్, పూర్ణమాధురి, సత్య, అనుషా తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన హిట్ సాంగ్స్ పాడి ఆకట్టుకున్నారు.

సిరులతల్లికి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మిని సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అనంతరం సిరులతల్లి ప్రసాదాన్ని అయనకు ఆలయ ప్రతినిధులు అందజేశారు.

డీఎస్సీ, టెట్‌పై అవగాహన సదస్సు రేపు

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీ, టెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కో ఆర్డినేటర్ పి.సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు నిష్ణాతులు పాల్గొని పరీక్షలపై అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి 160 పేజీల విద్యా మనో విజ్ఞాన శాస్త్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 93472 05549 నంబరుకు ఫోన్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో 'శ్రావణ' పూజలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన కొలువైన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 5 నుంచి వచ్చే నెల 3 వరకు నిర్వహిస్తున్న శ్రావణ మాస పూజల పోస్టర్‌ను సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు మాట్లాడుతూ శ్రావణ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేకాభిషేకాలు, అలంకరణలు, మహిళలచే వివిధ అమ్మవార్ల స్తోత్రపారాయణాలు, సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి శుక్రవారం 9న అమ్మవారికి ముత్యాల చీర అలంకరణ, 16న పట్టు వస్త్రాలంకరణ, 23న రజిత వస్త్రాలంకరణ, 30న సువర్ణ వస్త్రాలంకరణ, 108 బంగారు పుష్పాలతో పూజలు, మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో దోమా వెంకట బాలాజీకుమార్, కొల్లూరు రాము, కొల్లూరు విశాల, ఆలయ ప్రధానార్చకుడు ఆర్‌బీబీ కుమారశర్మ, కట్టమూరి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల కటౌట్ తొలగింపు



జగదాంబ జంక్షన్‌లో తొలగిస్తున్న కూటమి నేతల కటౌట్

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: ఎట్టకేలకు జీవీఎంసీ అధికారుల కళ్లు తెరుచుకున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను ఉల్లంఘిస్తూ కూటమి నేతలు ఏర్పాటు చేసిన కటౌట్‌ను తొలగించారు. గత నెల 30 నుంచే ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా.. జగదాంబ జంక్షన్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి జీవీఎంసీ అధికారులు క్లాత్‌తో ముసుగు వేసి, ఆ పక్కనే ఉన్న కూటమి నేతలతో కలిసి ఉన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ కటౌట్‌ను వదిలేశారు. కోడ్ ఉల్లంఘన జరగడంతో 'కూటమి నేతలకు కోడ్ వర్తించదా' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. జీవీఎంసీ అధికారులు స్పందించి సోమవారం ఉదయం జగదాంబ జంక్షన్‌లో ఉన్న కూటమి నేతల కటౌట్‌ను తొలగించారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- కొండవాలులో రక్షణ చర్యలు చేపట్టాలి
- జోనల్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం
- 47వ వార్డులో పర్యటన



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచాలని, కొండవాలు మెట్ల మార్గాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సంజీవయ్యా కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాలువలో పూడికలు, ఫ్లోటింగ్ మెటీరియల్ అధికంగా వస్తున్నందున వాటిని ఎప్పటికప్పుడు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లోని మెట్ల మార్గాల్లో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నివాసాల్లోకి వర్షపు నీరు చేరుతున్నందన.. శాశ్వత పరిష్కారం కోసం రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆయన ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో డయేరియా, అతిసార వ్యాధి, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, దోమల వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్‌కు సూచించారు. వయసు పైబడిన పారిశుధ్య కార్మికులను కొండవాలు ప్రాంతాల నుంచి వేరొక చోటుకు మార్చివేసి సమర్థులైన కార్మికులను ఏర్పాటు చేయాలని జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-5 ఈఈలు, మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి(ఆర్వో) బాబూరావు, ఏసీపీ వెంకటరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన



కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర కో-ఆర్డినేటర్ అమ్మినాయుడు

మహారాణిపేట: స్థానిక అచ్యుతరామ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని రాష్ట్ర సహిత విద్యా కోఆర్డినేటర్ అమ్మినాయుడు సోమవారం సందర్శించారు. కేంద్రంలో పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆనంద్, భవిత టీచర్లు పి.శ్వేత, పి.ప్రతిమ, ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

రోజూ కాలువల శుభ్రత



పాతనగరంలోని కాలువలో సిబ్బందితో చెత్త తీయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ ఆదేశించారు. జోన్‌లోని వన్ టౌన్ ప్రధాన రహదారి, పూర్ణా మార్కెట్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి, కాలువలను పరిశీలించారు. కాలువల్లో ఎక్కడా మురుగు నీటి ప్రవాహం ఆగకుండా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వంటివి లేకుండా రోజు పరిశుభ్రం చేయాలన్నారు. లేనిపక్షంలో నీటిలో దోమ లార్వాల ఉత్పత్తి జరిగి వ్యాధులకు కారణమవుతాయని చెప్పారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సెక్రటరీలు విధిగా కార్మికులతో పనులు చేయించాలన్నారు. నివాసులు, దుకాణ యాజమానులు చెత్తను కాలువల్లో వేయకుండా ప్రతి ఇల్లు, దుకాణం వద్ద మూడు రకాల చెత్త డబ్బాలు పెట్టుకోవాలని సూచించారు. లేనిపక్షంలో దుకాణదారులకు అపరాధ రుసుం విధించాలని కార్యదర్శులను ఏఎంహెచ్‌వో ఆదేశించారు. రహదారులపై ఎక్కడా మురుగు నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అఖిల భారత తేలి సాహూ మహాసభకు పెబ్బిలి



మహాసభ జాతీయ సమావేశంలో మాట్లాడుతున్న పెబ్బిలి రవికుమార్

డాబాగార్డెన్స్: దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం నిర్వహించిన అఖిల భారత తేలి సాహూ మహాసభ జాతీయ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ పెబ్బిలి రవికుమార్ హాజరయ్యారు. జాతీయ మహాసభలో మాట్లాడే అవకాశం రావడం సంతోషంగా ఉందని పెబ్బిలి పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో గాండ్ల తేలి సమాజం, సామాజిక, ఆర్థిక రాజకీయ అభివృద్ధి కోసం తోడ్పడాలని, అమరావతిలో ఎకరా స్థలం, రూ.2 కోట్ల నగదు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ సమావేశానికి విశాఖ జిల్లా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, కన్వీనర్ ఎన్నేటి తాతారావు, సెక్రటరీలు చిత్రాడ అప్పారావు, పేరూరి గణేశ్వరరావు, కోశాధికారి ఎన్నేటి సన్యాసిరావు, దాడి లక్ష్మణ కుమార్, గండేపల్లి సతీష్ హాజరయ్యారని తెలిపారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ డీపీవో రంజన్, ఇతర ఉన్నతాధికారులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో గల పర్సనల్ బ్రాంచిలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ కన్వీనర్ రంజన్ మహంతి, క్లబ్ సెక్రటరీ ఎం.రమేష్ నేతృత్వంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. సమాజంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు అత్యవసరమైన రక్తదాన సేకరణలో భాగస్వాములవ్వడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 56 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్స్ ఎ.వెంకటేశ్వరరావు, అప్పారావు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో వెంకటేశ్వరమెట్ట



వీధి దీపాలు వెలగక అంధకారంలో వెంకటేశ్వమెట్టపై ఓ వీధి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట నెల రోజులుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని, ఒకటి, రెండు రోజులు మినహా మిగతా రోజులు వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్వరమెట్ట దేవస్థానం వద్ద గల ఎస్ఎస్ 11 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో నిత్యం ఈ సమస్య ఉంటోందని, దీనిపై సచివాలయం, జీవీఎంసీ ఎలక్ట్రికల్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వెంకటేశ్వరమెట్టపై ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని, వాహనాల్లో పెట్రోలు దొంగిలిస్తున్నారని, స్థానికంగా పార్కింగ్ చేసిన ఆటోల్లో మద్యం, గంజాయి తాగుతూ రాకపోకలు చేసేవారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కూడా నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కృష్ణా కళాశాలలో ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ



ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశానికి అవకాశం కల్పించారు. 13ఏ బెటాలియన్, ఎన్‌సీసీ అధికారులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 36 క్యాడెట్ల ఖాళీలను భర్తీ చేయనున్నామని కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు తెలిపారు. వీరిలో 24 మంది పురుషులు, 12 మంది మహిళలను ఎంపిక చేస్తామన్నారు.